జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం | 20 | జూన్ | 2025 • పేజీలు : 5

## రూ. 7700.87 కోట్లు రుణ ప్రణాళిక

▪ జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 19, ప్రజాజ్యోతి:** 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.7700.87 కోట్లు లక్ష్య సాధనకు బ్యాంకర్లు సహకరించాలని భద్రాద్రి, కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. గురువారం ఐడిఓసి కార్యాలయం సమావేశం మందిరం లో బ్యాంకర్లు, జిల్లా అధికారులతో కలెక్టర్ , డీసీసీ, డీఎల్ ఆర్ సీ సమీక్షా

మిగతా 2 లో...

● ఉద్యోగుల బదిలీలతో కలతప్పిన కేటీపీఎస్ కార్మిక వాడలు ● చిట్టడవులను తలపిస్తున్న కేటీపీఎస్ కాలనీ లు ● నిర్వహణ పర్యవేక్షణ లోపంతో కాలనీలలో కొనసాగుతున్న అసాంఘిక కార్యకలాపాలు ● గంజాయి, మద్యం నిలయాలుగా మారిన కేటీపీఎస్ క్వార్టర్లు ● పట్టించుకోని కేటీపీ ఎస్ అధికారులు

## ఏది...? ఆనాటి వైభవం

ఒకే వరుసలో ఒక యూనిఫాంల గుచ్చినట్లు ఉండే కేటీపీఎస్ క్వార్టర్లు, అందమైన రహదారులు... అహలదాన్ని పంచే పార్కులు... రాత్రి పూట కూడా పగటిని తలపించేలా అద్భుతమైన వెలుగులు జిమ్మి లైటింగ్ ... నిత్యం జన సంచారం... ఇది ఒకప్పటి కేటీపీఎస్ కాలనీల వైభవం.... కేటీపీఎస్ కాలనీ లు లేని పాల్వంచను ఊహించుకోవడానికి కష్టంగా ఉండేది. అలాంటి కేటీపీఎస్ కాలనీ లు నేడు ఆనాటి వైభవాన్ని ప్రభావాన్ని కోల్పోయాయి. కేటీపీఎస్ పాత ప్లాంటును పూర్తిగా మూసివేయడం.... వందల మంది ఉద్యోగులను ఇక్కడి నుండి వివిధ ప్రాంతాలకు బదిలీ చేయడంతో కార్మికవాడలో కలతప్పి వేల వేల బోతున్నాయి...

◆ కొత్తగూడెం కలెక్టరేట్, ప్రజాజ్యోతి

2 లో..







## ప్రతిఒక్కరూ రక్తపరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలి

▪ జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**భద్రాచలం, జూన్ 19(ప్రజాజ్యోతి ):** ఏజెన్సీ ప్రాంతంలో ప్రతిఒక్కరూ రక్తపరీక్షలు చేయించుకునేలా వైద్యసిబ్బంది అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం ప్రపంచ సికిల్ సెల్ అనీమియా దినోత్సవం సందర్భంగా ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ఐటీడీఏ పీవో రాహుల్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ గిరిజన గూడేల్లో గిరిజన పిల్లలకు ఎక్కువగా సికిల్సెల్ అనీమియా వ్యాప్తి చెందుతుందని, ఇది పిల్లల నుంచి పెద్దల వరకు వ్యాప్తి చెందుతుందని దీనిని గుర్తించి సరైన సమయంలో వైద్యపరీక్షలు చేయించుకుంటే నివారించవచ్చన్నారు. సికిల్సెల్ అనీమియా ప్రాణాంతకమైన

మిగతా 2 లో...

## భద్రాద్రి రామయ్యకు హారం కానుక



**భద్రాచలం కల్చరల్, జూన్ 19(ప్రజాజ్యోతి ):** భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో స్వామివారికి హైదరాబాద్లోని కొండాపూర్కు చెందిన భక్తులు కృష్ణచైతన్య, రాజ్యలక్ష్మి దంపతులు 52.25 గ్రాముల బరువైన రూ.4,98,520 విలువైన బంగారు హారాన్ని గురువారం ఆలయ ఈవో రమాదేవికి కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా అర్చకులు వారికి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

## పాల్వంచ ప్రభుత్వ వైద్యశాలను సందర్శించిన రాష్ట్ర టి వి వి పి కమిషనర్ అజయ్ కుమార్

▪ వైద్య సిబ్బంది సేవలకు ప్రశంసలు

▪ మరింత అంకితభావంతో పని చేయాలని పిలుపు



**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 19, ప్రజాజ్యోతి:** పాల్వంచ ప్రభుత్వ వైద్య శాలలను రాష్ట్ర టీవీ వి పి కమిషనర్ అజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, లు గురువారం సందర్శించారు, ఈ సందర్భంగా డాక్టర్ అజయ్ కుమార్ , జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ జిల్లాలోని వైద్య విధాన పరిషత్ ఆసుపత్రి సిబ్బంది చేస్తున్న సేవలను అభినందించి ప్రశంసించారు, మారుమూల ప్రాంతాలైన కూడా అంకిత భావం తో పని చేసి

మిగతా 2 లో...

## రూ. 7700.87 కోట్లు రుణ ప్రణాళిక



(మొదటి పేజీ తరువాయి... )

సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్షిక రుణ ప్రణాళికను ఖరారు చేశారు. అదేవిధంగా గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రైతులకు రుణాల పంపిణీ, స్వయం సహాయక సంఘాల రుణాలు, రికవరీ, పీఎం జీపీవై రుణాలు, ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖల పథకాలకు సంబంధించి రుణ లక్ష్య పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, జిల్లాలో వివిధ ఆర్థిక మద్దతు పథకాల లక్ష్యసాధనకు రుణాలు అందించడంలో బ్యాంకర్లు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు రూ. 5242.49 కోట్లకు గాను 3960.63 కోట్లు రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. వివిధ పథకాల్లో మంజూరైన రుణాల రికవరీపై శ్రద్ధ వహించాలని కోరారు. యువతకు ఉపాధి కల్పించే విషయంలో చొరవ చూపాలని బ్యాంకర్లకు సూచించారు. అనంతరం 2025-26 ఆర్థిక సంవత్సరం వార్షిక రుణ ప్రణాళికను రూ.7700.87 కోట్లతో కలెక్టర్ ఆవిష్కరించారు. వ్యవసాయ అవసరాల కోసం రూ.3838.00 కోట్లు ఎంఎస్ ఎంఈ కింద రూ.847.80 కోట్లు, ఇతర రంగాలకు రూ.4,883.99 కోట్ల రుణాలుగా బ్యాంకర్లు అందజేయాలని కోరారు. రుణాల కోసం బ్యాంకులకు వచ్చే రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జించే పంటల సాగుపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న రైతు వేదిక వద్ద బ్యాంకు అధికారులు శిబిరాలు ఏర్పాటు చేసి రైతులకు రుణ సహాయం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, లీడ్ బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి, పరిశ్రమల శాఖ మేనేజర్ తిరుపతయ్య, పశుసంవర్ధక శాఖ డిడి వెంకటేశ్వర్లు, వివిధ బ్యాంకుల మేనేజర్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరూ రక్తపరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలి

(మొదటి పేజీ తరువాయి... )

వ్యాధి కానప్పటికీ జన్యుపరంగా కాకుండా తల్లిదండ్రుల నుంచి సంక్రమిస్తుందన్నారు. శరీరంలో ఎర్రరక్తకణాలు 120 రోజులకు నశించి తిరిగి కొత్త రక్తకణాలు వస్తుంటాయని, ఈ వ్యాధి సోకిన వారికి 20 రోజుల్లోనే రక్తకణాలు నశించి శరీరమంతా పాకి రక్తహీనత, విపరీతమైన నొప్పి, చేతులు, కాళ్లు వాపు, ఇన్ఫెక్షన్లు రావడం, పెరుగుదలలో జాప్యం జరగడం, దృష్టి సమస్యలు, అవయవ నష్టం, అంధత్వం, ఛాతినొప్పి, గుండెజబ్బులు, అల్సర్ వంటి వ్యాధులు సంభవిస్తాయన్నారు. త్వరగా గుర్తించి సరైన చికిత్సలు తీసుకుంటే ఎలాంటి వ్యాధులు దరిచేరవన్నారు. ఆదివాసీ గిరిజన గ్రామాల్లో ఈ వ్యాధిని గుర్తించి ఎక్కువగా గిరిజనులకు అవగాహన కల్పించి తప్పనిసరిగా సికిల్సెల్ అనీమియా టెస్టులు, రక్తపరీక్షలు చేయించేలా వైద్యసిబ్బంది ప్రత్యేక చొరవ చూపాలన్నారు. అన్ని పీహెచ్సీలు, సబ్సెంటర్లు, అంగన్వాడీ సెంటర్లలో, పాఠశాలల్లో ముఖ్యమైన కూడళ్లలో సికిల్సెల్ అనీమియా టెస్టింగ్లు క్యాంపులు ఏర్పాటు చేసి ప్రతిఒక్కరికీ పరీక్షలు చేయించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే, పీవోలు మాట్లాడుతూ 130 పంచాయతీల్లో క్యాంపులు నిర్వహించి ప్రతిఒక్కరికీ టెస్టింగ్లు చేయించేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని, సికిల్సెల్ అనీమియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించి ఏజెన్సీలోని గిరిజన గ్రామాల్లో ప్రతిఒక్కరూ రక్తపరీక్షలు చేయించుకునేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్వో ఎల్.భాస్కర్ నాయక్ , ఏసీఎంవో రమణయ్య, డిప్యూటీ డీఎంహెచ్వో విజయలక్ష్మి ,ఏడీఎంహెచ్వో చైతన్య, సికిల్సెల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మధుకర్, ఆర్ఎంవో రాజశేఖర్, ఇతర శాఖల అధికారులు, వైద్యసిబ్బంది, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఏది...? ఆనాటి వైభవం

**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 19, ప్రజాజ్యోతి:** ఒకే వరుసలో ఒక యూనిఫాంల గుచ్చినట్లు ఉండే కేటీపీఎస్ క్వార్టర్లు, అందమైన రహదారులు, ,, అహలదాన్ని పంచే పార్కులు,,,రాత్రి పూట కూడా పగటిని తలపించేలా అద్భుతమైన వెలుగులు జిమ్మి లైటింగ్ , , , ,, నిత్యం జన సంచారం, , ఇది ఒకప్పటి కేటీపీఎస్ కాలనీల వైభవం, కేటీపీఎస్ కాలనీ లు లేని పాల్వంచను ఊహించుకోవడానికి కష్టంగా ఉండేది, అలాంటి కేటీపీఎస్ కాలనీ లు నేడు ఆనాటి వైభవాన్ని ప్రభావాన్ని కోల్పోయాయి, కేటీపీఎస్ పాత ప్లాంటును పూర్తిగా మూసివేయడం, ,,,,,, వందల మంది ఉద్యోగులను ఇక్కడి నుండి వివిధ ప్రాంతాలకు బదిలీ చేయడంతో కార్మికవాడలో కలతప్పి వేల వేల బోతున్నాయి, పాల్వంచలో 720 మెగావాట్ల సామర్థ్యం ఉన్న పాత ప్లాంట్ ను మూసి కొత్తగా ఎనిమిది వందల మెగావాట్ల సామర్థ్యం ఉన్న కే డి పి ఎస్ ఏడవదశ కర్మాగారంను నిర్మించారు, వాస్తవానికి ఇక్కడ నుండి ఒక్కరిని కూడా ఉద్యోగులను, కార్మికులను బదిలీ చేయాల్సిన



అవసరం లేదు, కేవలం రాష్ట్ర క్యాడర్ అయినా ఇంజనీర్లు, అకౌంట్స్ విభాగం ఉద్యోగులను మాత్రమే బదిలీ చేయాల్సి ఉంది, కానీ అప్పటి యాజమాన్యం కొన్ని ఇంజనీరింగ్ సంఘాల నాయకుల చెప్పుడు మాటలు విని ఇంజనీర్లను బదిలీ చేయకుండా కేవలం పాత ప్లాంట్ కార్మికులను మాత్రమే బదిలీ చేసింది, దీంతో సుమారు 2000 మంది కార్మికులను ఇక్కడ నుంచి బి టి పి ఎస్, వైటీపీఎస్, ఇతర ప్రాంతాలకు బదిలీ చేసింది, బదిలీ అయిన కార్మికులంతా కేటీపీఎస్ క్వార్టర్లను ఖాళీ చేసి వెళ్లిపోయారు, దీంతో సగానికి ఎక్కువ క్వార్టర్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి, దీనికి తోడు సంబంధిత అధికారుల నిర్వహణ లోపం, పర్యవేక్షణ కొరవడం, నిలువెత్తు నిర్లక్ష్యం వెరసి కేటీపీఎస్ కాలనీ లు అధ్వానంగా మారాయి, కాలనీలలో చెత్త చెదారం, చెట్లు పెరిగి అడవులను తలపిస్తున్నాయి, టిడిపి ఎస్ కార్మికులు ఖాళీ చేసిన వాటర్ లో శిథిలావస్థకు చేరడంతో దొంగలు క్వార్టర్లకు ఉన్న గుమ్మాలు, ఇతర విలువైన సామాగ్రిని అపహరించకపోతున్నారు, ఇప్పుడు ఖాళీగా ఉన్న ఓటర్లు ఆకతాయిలకు అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి, అదేవిధంగా గంజాయి మందుబాబులకు అడ్డాగా మారాయి, కొంతమంది యువకులు కాలనీలలోకి వచ్చి గంజాయి మద్యం సేవిస్తుండడంతో ప్రస్తుతం ఉంటున్న కార్మికులు వారిని ఇది ఏమిటని ప్రశ్నిస్తే వారిపై గంజాయి మందు బాబులు దురుసుగా ప్రవర్తిస్తు గొడవకు దిగుతున్నట్లు పలువురు వాపోతున్నారు, ఇక అధికారుల నిర్వహణ లోపంతో పార్కులు అన్నీ కూడా గడ్డి పెరిగి అడవులను లను తల పిస్తున్నాయి, దీనికి తోడు ఖాళీగా ఉన్న క్వార్టర్ల వద్ద వీధిలైట్లు వెలగక పోవడంతో చిమ్మ చీకట్లుగా మారాయి, అదేవిధంగా కాలనీలలో రహదారులు గుంతల మయంగా మారాయి, కేటీపీఎస్ అధికారుల వైఖరితో విసుగు చెందిన కార్మికులు, ఉద్యో గులు ఎక్కువమంది బయట ఇండ్ల కొనుగోలు, నిర్మాణానికి ముగ్గు చూపుతున్నారు, ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలపై శ్రద్ధ చూపాలని కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు,

## పాల్వంచ ప్రభుత్వ వైద్యశాలను సందర్శించిన రాష్ట్ర టి వి వి పి కమిషనర్ అజయ్ కుమార్





(మొదటి పేజీ తరువాయి... )

ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారని వారి సేవలను కొనియాడారు. పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన రాష్ట్ర టీవీవీపీ కమిషనర్ డా అజయ్ కుమార్ ఆసుపాత్రులలో అన్ని వార్డులను,ఓపి రూమ్స్, డయాలసిస్ వార్డ్, ఆపరేషన్ థియేటర్,ఫార్మసి స్టోర్ లను చూసి రోగులతో ఆసుపత్రిలో అందుతున్న సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. యాభై పడకల ఆసుపత్రి అయినప్పటికీ వంద పడకల ఆసుపత్రి స్థాయి లో సేవలందిస్తున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంలో జిల్లా కలెక్టర్ తో కలిసి పాల్వంచ పట్టణం లో ఒక ఫంక్షన్ హాల్ లో జిల్లాలోని భద్రాచలం,చర్ల,అశ్వారావుపేట , బుర్గంపాడు , మణుగూరు,ఇల్లందు ప్రభుత్వ ఆసుపత్రులలో ఉత్తమ సేవలందించిన వైద్య సిబ్బంది కి ప్రశంస పత్రాలు అందించారు. ముందుగా చికిత్స పొంది ఆరోగ్యంగా ఉన్న వారి నుండి అభిప్రాయాలు తెలుసుకున్నారు. సిబ్బంది మరింత బాధ్యతగా అంకిత భావం తో రోగులకు సేవ చేయాలని పిలుపిచ్చారు.జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో పవిత్ర మైనది అని ఆ వృత్తి లో వైద్య సిబ్బంది కు మాత్రమే ప్రాణాలు నిలబెట్టే అవకాశం ఉందన్నారు. కాబట్టి ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా సేవలు అందించాలన్నారు. జిల్లాలోని అన్ని వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో సూపరింటెంట్లు,ఇతర వైద్య సిబ్బంది చాలా కష్టపడి పనిచేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో డి సి హెచ్ ఎస్ డా రవి బాబు,జిల్లాలోని వైద్య విధాన పరిషత్ సూపరింటెండెంట్ లు,నర్సింగ్ ,పారా మెడికల్ ,సానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేత

**టేకులపల్లి,జూన్ 19, ప్రజాజ్యోతి :**టేకులపల్లి మండలంలోని పాత తడికలపూడి గ్రామానికి చెందిన పాస్టర్ బట్టు దేవరాజ్ అనారోగ్యంతో ఖమ్మం హాస్పటల్ చేరి చికిత్స చేయించుకునీ వచ్చాడని తెలుసుకొని టేకులపల్లి మండల పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ సభ్యులు అతనీ కుటుంబపరిస్థితిని ,పాస్టర్ ఆరోగ్య పరిస్థితిని గమనించి అనారోగ్యముతో బాధ పడుతున్న వారి కొరకు ప్రార్థన చేసి మండలంలోని పాస్టర్స్ సహకారంతో ఆర్థిక సాయం6000 వేల రూపాయలు అందజేశారు. టేకులపల్లి మండల పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ ప్రెసిడెంట్ జి .రాజు రామ్ చందర్, సెక్రెటరీ టి .బోయాజ్ ,జాయింట్ సెక్రటరీ ఎం .మార్కు ,సభ్యులు బి. అబ్రహం, దానియేలు తదితరులు పాల్గొన్నారు



# జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ కు భూక్యా పాపా వినతి



**టేకులపల్లి,జూన్ 19, ప్రజాజ్యోతి:** భూమి సమస్య పరిష్కారం కాకా డిల్లీ లో ఉన్న జాతీయ ఎస్టి కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ ని కలిసిన భూక్యా పాపా నాయక్ టేకులపల్లి మండలం,కొత్త తండా గ్రామానికి చెందిన భూక్యా పాపా నాయక్ కొత్త తండా గ్రామంలో 5 ఎకరాల భూమి ఉన్నది ఆ భూమి తనది కాదని లక్కినేని శ్యామ్ అతనిని ఇబ్బంది పెట్టడంతో పాటుగా పోలీసులతో భూక్యా పాపా నాయక్ ను పోలీస్ స్టేషన్ లో బందించి,తన ఇద్దరు కొడుకులను హౌస్ అరెస్ట్ చేసి తన భూమిలో ప్రవేశించి తన ఐదు ఎకరాల భూమి చుట్టూ ఉన్న పెన్సింగ్ రాళ్లను డోజర్ ట్రాక్టర్ తో ధ్వంశం చేయడం జరిగింది.ఈ విషయం గురించి ఎస్పీకి, డి.ఎస్.పికి,మండల తహసీల్దార్ కి ఎన్ని పిర్యాదులు ఇచ్చిన కూడా లక్కినేని శ్యామ్ పై ఎటువంటి చర్యలు తీసుకోలేదు, ఆ భూ సమస్య ఇటు రెవిన్యూ డిపార్ట్మెంట్,అటు పోలీస్ డిపార్ట్మెంట్ మధ్య న్యాయం జరగక, ఎన్నోసార్లు ఎమ్మార్వో కి,కలెక్టరకి, ఆర్డీవో కి,ఎస్పీకి, ఐటీడీఏ పీవోకి ఫిర్యాదు ఇచ్చినప్పటికీ కూడా ఎటువంటి న్యాయం జరగలేదు, అందుకని 18 వ తారీకు నాడు ఢిల్లీ లో ఉన్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ని కలిసి ఫిర్యాదు ఇవ్వడం జరిగింది, వారు సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు భూక్యా రవి రాథోడ్, సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లావుడియా ప్రసాద్ నాయక్ పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**ఇల్లందు, జూన్ 19, ప్రజాజ్యోతి:**యువనేత, యంపి రాహుల్ గాంధీ 54వ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదిన కేక్ ను కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఇల్లందులో జరుపుకోవడం సంతోషకరమన్నారు. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేసేవరకు కాంగ్రెస్ శ్రేణులు నిరంతరం కృషి చేయాలని కోరారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటేనే అన్ని వర్గాలకు ఉపయోగపడే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజల పక్షపాతి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటేనే అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా జీవనం కొనసాగిస్తారని పేర్కొన్నారు. అవినీతిరహిత పాలన కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, హరిహర క్షేత్ర ఆలయ కమిటీ చైర్మన్ గందె సదానందం, ఇల్లందు పట్టణ, మండలం, టేకులపల్లి, గార్ల బయ్యారం, కామేపల్లి మండలాల అధ్యక్షులు దొడ్డ డానియల్, పులి సైదులు, దేవా నాయక్, కంబాల ముసలయ్య, రామారావు, నర్సింహా రెడ్డి, సీనియర్ నాయకులు మండల రాము, మదుగు సాంబమూర్తి, భోళ్ల సూర్యం, ఐఎన్టియుసి నేతలు జె. వెంకటేశ్వర్లు, పడిదల నవీన్, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**టేకులపల్లి,జూన్19,ప్రజాజ్యోతి:** మండలంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు ఆఫీస్ లో మాజీ ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్ గాంధీ జన్మదిన సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియచేసారు.కార్యకర్తలకు, గ్రామ ప్రజలకు, పనులకు అరటి పండ్లు స్వీట్లు కేకు పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దేవా నాయక్ ,నాయకులు రెడ్యానాయక్,భద్రు, సంజయ్,చందర్ సింగ్, పోశాలు, వీరభద్రం,సర్దార్, కోరం మహాలక్ష్మి బానోత్ చంద్రకళ, సరిత,మధురెడ్డి, , సేవ్యా, ఈసం ప్రసాద్, నర్సయ్య, ఈశ్వర్, సైదులు,వెంకటి, సూక్కో,సుధీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీపుట్టినరోజు వేడుకలు




**కొత్తగూడెం,జూన్19,ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ టిపిసిసి లీగల్ సెల్ ఆధ్వర్యంలో ఘనంగా భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ యాస యుగంధర్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి వి సుధాకర్, భద్రాద్రి కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ,సీనియర్ న్యాయవాదులు గోపికృష్ణ వైకృష్ణ,,జియా ఉల్ హాసన్,మారపక రమేష్,అంకుష్‌పాషా,సలీమ్ మియా, k కుమార్,రవి, దేవదాస్, మహిళా న్యాయవాదులు యాస మౌనిక, నందిని,శ్వేతా, బేబీ, షామిలి తదితరులు పాల్గొన్నారు.

## సండే బ్రిక్స్ ఓపెన్ చాలెంజ్ : ప్రతి ఒక్కరికీ అవకాశం

- పర్యావరణ హితంగా మట్టి ఇటుకలు తయారు చేయండి
- ఆరోగ్యాన్ని పొందండి
- బహుమతులు గెలుచుకోండి
- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 19, ప్రజాజ్యోతి:** పర్యావరణహితంగా మట్టి ఇటుకలు తయారు చేయండి, ఆరోగ్యాన్ని పొందండి, బహుమతులు గెలుచుకోండని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ పిలుపునిచ్చారు, ఈ సందర్భంగా గురువారం కలెక్టర్ మాట్లాడుతూ "సండే బ్రిక్స్ చాలెంజ్" పేరుతో మన జిల్లా యంత్రాంగం వినూత్నంగా చేపడుతున్న ఈ కార్యక్రమం ఈ నెల 22 న (ఆదివారం), ప్రగతి మైదానం, కొత్తగూడెం లో ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 9 గంటల వరకు జరిగే ఈ ఓపెన్ ఛాలెంజ్ లో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొనవచ్చని తెలిపారు. బెంగళూరులో సి ఎస్ ఈ బి సుధాకర్ రెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం ప్రగతి మైదానంలో నిర్వహించబడుతుందన్నారు, ఇది కేవలం పోటీ మాత్రమే కాదని, కొద్దిసేపు మట్టితో పనిచేసే అనుభవం ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని, మార్పు పట్ల కొత్త దృష్టిని కలిగిస్తుందన్నారు.ఎక్కువ ఇటుకలు తయారు చేసిన వ్యక్తిని "బ్రిక్స్ ఛాంపియన్" గా గుర్తించి, తాను స్వయంగా టీ–షర్ట్ బహుమతి అందజేయడం జరుగుతుందని తెలిపారు. యువత, వాకర్లు, పౌరులు, విద్యార్థులు ఉదయం 7 గంటలలోపు హాజరై ఉత్సాహంగా పాల్గొనాలని సూచిం చారు.ఈ కార్యక్రమం ద్వారా స్థానిక వనరుల వినియోగం, శ్రమకు గౌరవం, ఆరోగ్యకరమైన జీవనశైలి, సామాజిక ఐక్యత, వ్యక్తిగత చొరవ వంటి విలువలను పెంపొందించాలనే ఉద్దేశంతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు.అదేవిధంగా, ఓపెన్ చాలెంజ్ అనంతరం అధికారులు, ఉద్యోగుల కోసం ఇట్టి ఇటుకలు తయారీ పై వర్క్‌షాప్ ఉదయం 9 గంటల నుండి నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించబడుతుందని కలెక్టర్ తెలిపారు

## ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవ సందర్భంగా అవగాహన ర్యాలీ



**టేకులపల్లి,జూన్ 19, ప్రజాజ్యోతి:** మండలంలోని ముత్యాలపాడు క్రాస్ రోడ్డు గ్రామంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి కందుల దినేష్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ 2047 సంవత్సరాని కల్లా సికిల్ సెల్ రక్తహీనతను తొలగించడానికి ప్రతి ఒక్కరూ ఈ వ్యాధిపై అవ గాహన కలిగి ఉండాలని తల్లిదండ్రుల నుండి పిల్లలకు వంశపారంపర్యంగా జన్యుపరంగా సంక్రమించే ఈ వ్యాధి రక్త కణాలు అర్ధ చంద్రాకారంలో ఉండి రక్త ప్రవాహానికి అడ్డు పడడం వల్ల శరీరంలోని ముఖ్యమైన అవయవాలైన కిడ్నీ లివరు స్ప్లీన్ ఎముకలు మెదడుకు రక్త ప్రసరణ తగ్గిపోయి ఇన్ఫెక్షన్లు రావడానికి ఎముకలు, జాయింట్ పెయిన్స్ ఛాతిలో కడుపులో నొప్పి రావడం అరచేతులు పాదాలు వాపు రావడం శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది చిన్న చిన్న పనులకే అలసిపోవడం నీరసం పాలిపోయిన చర్మం చిన్నపిల్లల్లో ఎదుగుదల లేకపోవడం ఎన్నో సమస్యలు ఉంటాయని వివాహానికి ముందే సికిల్ సెల్ స్క్రీనింగ్ పరీక్షలు విధిగా చేయించుకోవాలని వైద్యాధికారి కోరారు . ప్రభుత్వ ఆసుపత్రులలో ఆరోగ్య ఉప కేంద్రాలలో ఉచితంగా సికెల్ సెల్ ఎనీమియా స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నామని 40 సంవత్సరాల లోపు వయస్సు వారందరూ కూడా విధిగా ఆ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుని ఈ వ్యాధి లేని భారత సమాజానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కంచర్ల వెంకటేష్ ,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, నర్సింగ్ ఆఫీసర్ జగదాంబ,పబ్లిక్ హెల్త్ నర్సాఫీసర్ చంద్రకళ, సూపర్వైజర్లు పోరండ్ల శ్రీనివాస్,నాగుబండి వెంకటేశ్వర్లు,గుజ్జా విజయ, కౌసల్యసింగ్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు ధరణి, హారిక ,అమూల్య, ఇంద్రజ ,రుక్సానా, శైలజ ,ఏఎన్ఎంలు ,ఆశా కార్యకర్తలు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

**ఇల్లందు, జూన్ 19, ప్రజాజ్యోతి:** ఈనెల 21న మండలంలోని నిజాంపేట గ్రామంలో రోటరీ క్లబ్ అఫ్ ఖమ్మం సెంట్రల్ ఆర్ఐ డిస్ట్రిక్ట్ 3150, హైదరాబాద్ యంఎన్జె క్యాన్సర్ వైద్యశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత ముందస్తు గర్భకోశ, రొమ్ము, నోటీ క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రోగ్రామ్ కో – ఆర్డినేటర్ ఆర్టిఎన్. కందుల కొండల్ రావు, ప్రాజెక్ట్ స్పాన్సర్ ఆర్టిఎన్. పోటు ప్రసాద్ రావు కుటుంబ సభ్యులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ క్యాన్సర్ వైద్య శిబిరానికి 19 నుంచి 65 ఏళ్ల మహిళలు హాజరు కావచ్చని పేర్కొన్నారు. అదేవిదంగా ఖమ్మం శరత్ మ్యాక్సి విజన్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేసి క్యాటరాక్ట్ అవసరమైన పేదవారికి ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. ఈ క్యాన్సర్ వైద్యశిబిరంలో డయాబెటీస్ ప్రొఫైల్, థైరాయిడ్ ప్రొఫైల్, లివర్ ఫంక్షన్ ప్రొఫైల్, రేనల్స్ టెస్ట్, లిపిడ్ ప్రొఫైల్ వంటి 57 రకాల పరీక్షలు చేయబడునన్నారు. ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ తో రావాలని కోరారు.

## పేద కుటుంబకు బియ్యం వితరణ



**టేకులపల్లి,జూన్19, ప్రజాజ్యోతి:** మండలంలోని కోక్య తండ గ్రామంలోని ధరావత్ మాంగిని అనారోగ్యకారణంతో ఇటీవల మరణించడం జరిగింది. గురువారం కోక్య తండ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ధరావత్ మాంగిని కుటుంబానికి 50 కేజీల బియ్యాన్ని వితరణ చేశారు. ధారావత్ కుమార్, రాంసింగ్, భద్రు, సక్రు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## వన్య ప్రాణులను వేటాడితే ఉపేక్షించేది లేదు

- రేగళ్ల రేంజ్ అధికారి. జస్వంత్ ప్రసాద్



**ఆళ్ళపల్లి,జూన్19 ప్రజా జ్యోతి:**రేగళ్ల రేంజ్ పరిధిలో బుసరాయి గ్రామానికి చెందిన లచ్చు మరియు వెంకటేష్ అనే వ్యక్తులకు వన్యప్రాణులను వేటాడిన కేసులో నిందితులకు 45 రోజుల తరువాత రూ 20,000/– పూచీకత్తు పై ప్రతి సోమవారం రేంజ్ ఆఫీస్ నందు హాజరయ్యే ల షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయడం జరిగింది, జిల్లా జడ్జి అటవీశాఖ తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు రేగళ్ల రేంజ్ అధికారి V జశ్వంత్ ప్రసాద్ తేలియజేయడం జరిగింది, వన్యప్రాణుల విషయంలో ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, అటవీ రక్షణలో ,వన్యప్రాణులసంరక్షణలో కట్టుబడి ఉన్నామని దీనికి ప్రజలు కూడా సహకరించాలని కోరడం జరిగింది.

## బీసీ డిగ్రీ గురుకులంలో స్పాట్ అడ్మిషన్స్



**అన్నపురెడ్డిపల్లి, జూన్ 19, ప్రజా జ్యోతి:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం, గ్రామం లో నిర్వహించబడుతున్న మహాత్మాజ్యోతిబా పూలే బీసీ గురుకుల పురుషుల డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం డిగ్రీ ప్రవేశాలకు స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ ఎస్ కె బురాన్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కళాశాలలో బీఎస్సీ ( ఎంపీసీ ఎస్, ఎంపీసీ,బి జెడ్ సి ),బీకాం ( కంప్యూటర్ అప్లికేషన్స్ ),బిఏగ్రూపులలో ఖాళీలు ఉన్నాయి. ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అన్ని ధ్రువపత్రాలతో అన్నపరెడ్డిపల్లి లోని డిగ్రీ కళాశాలలో జరుగు స్పాట్ కౌన్సిలింగ్ కు ఈనెల 24వ తేదీ లోపు హాజరు కాగలరు. ఈ కళాశాలలో ప్రవేశం పొంది న విద్యార్థులకు నాణ్యమైన విద్య , ఉచిత వసతులు ,టెక్స్ట్ బుక్స్, నోటుబుక్స్ అధునాతన లాబరేటరీలు,కంప్యూటర్ ల్యాబ్ ,ఫిజికల్ ఎడ్యుకేషన్, పీజీ కో చింగ్, మరియు ఎంప్లాయబులిటీ స్కిల్స్ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నేర్పించబడును. ఇతర వివరాలకు 9059490623,8500006021, 9392540836, 9951734877,9553131588 నంబర్లను సంప్రదించగలరు.

## ప్రపంచ సికెల్ సెల్ ఎనీమియా అవగాహన

- వైద్యాధికారి. సంఘమిత్ర

**ఆళ్ళపల్లి. జూన్19. ప్రజాజ్యోతి :**ఈ రోజు ఆళ్ళపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి సంఘమిత్ర ఆధ్వర్యంలో ప్రపంచ సికెల్ సెల్ రోజు ను జరుపుకోవడం జరిగిందిఇందులో భాగంగా సికెల్ సెల్ అంటే ఏమిటి అది ఎలా వస్తుంది ఎవరికి వస్తుంది అనే విషయాన్ని ప్రజలకు తెలియజేయడం జరిగింది సికెల్ సెల్ అనేది ఒక జన్యు పరమైన రక్త హీనత రక్తం లో హీమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉంటుంది. **ఈ వ్యాధి యొక్క లక్షణాలు ఇలా ఉంటాయి: –*రక్త కణాల సంఖ్య తగ్గడం: –కళ్ళు పసుపు రంగులోకి మారడం :–తీవ్రమైన వొళ్ళు నొప్పులు మరియు కీళ్లలో నొప్పులు: – శ్వాశ తీసుకోవడం లో ఇబ్బంది :–. అలసట:*–**తరచుగా అంటు వ్యాధులు రావడం ఇలా మొదలగు వ్యాధులకు గురి అవుతారాని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది టీ రమాదేవి HE, పార్వతి ఎల్ టీ , సుగుణ ANM , సావిత్రి ANM , రమణ ANM , సునీత స్టాఫ్ నర్స్, యాకుబి , పార్మసిస్ట్ మురళీ మోహన్, DEO నాగేశ్వరావు , మొదలగు వారు పాల్గొన్నారు.



# పంచాయతీల అభివృద్ధి సమగ్రంగా అంచనా వేసేందుకు పంచాయతీ అడ్వాన్స్మెంట్ ఇండెక్స్ పై అవగాహన అవసరం

- కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 19, ప్రజా జ్యోతి:** పంచాయతీ అభివృద్ధి సూచిక ( పి ఎ ఐ 2.0)లో పేర్కొన్న అంశాలపై గురువారం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశ మందిరంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు , మండల పంచాయతీ అధికారులు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథి గా మాట్లాడుతూ పంచాయతీ అడ్వాన్స్మెంట్ ఇండెక్స్ అనేది కేవలం ఒక ర్యాంకింగ్ సూచిక కాదని, గ్రామీణ అభివృద్ధిని మలుపుతిప్పే ఒక ప్రణాళికాత్మక మార్గదర్శక పద్ధతి అని ఈ సూచిక ద్వారా గ్రామ పంచాయతీల ప్రదర్శనను వివిధ పారామీటర్లలో అంచనా వేయవచ్చన్నారు, విద్య, ఆరోగ్యం, తాగునీరు, పారిశుద్ధ్యం, పర్యావరణం, డిజిటల్ లావాదేవీలు, మహిళా భాగస్వామ్యం వంటి విభిన్న అంశాల్లో పంచాయతీల స్థితిగతులు అర్థమవుతాయి అని పేర్కొన్నారు.కాబట్టి అందరు అధికారులు జాగ్రత్త వహించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ పోస్టర్లను ఆవిష్కరించి అన్ని మండలాలకు ఈ సర్వే ను అన్ని పంచాయతీలు ,గ్రామాలలో విస్తీర్ణంగా ప్రచారం చేయాలని సిటిజన్ ఫీడ్బ్యాక్ మొబైల్ యాప్ ద్వారా ఇవ్వాలని కోరారు, వరదల పట్ల అందరూ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, ఆపద సమయంలో అవసరమైన టార్చ్ లైట్లు, రోప్లు అందుబాటులో ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. రైతులకు మునగ సాగు, ఫామ్ పౌండ్స్ నిర్మాణం, అజోల్ల పెంపకం తదితరు వాటి పైన అవగాహన కల్పించాలని సూచించారు. ఈ శిక్షణలో గ్రామీణాభివృద్ధికి సంబంధించి తొమ్మిది ప్రధాన అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. పేదరికం లేని , మెరుగైన జీవనోపాధి పంచాయతీ, ఆరోగ్యకరమైన పంచాయితీ, బాలల స్నేహపూర్వక పంచాయతీ, తగినంత నీరు ఉన్న పంచాయతి, క్లీన్ అండ్ గ్రీన్ పంచాయతీ,పంచాయతీలలో స్వయం సమృద్ధి మౌలిక స దుపాయాలు, సామాజిక ంగా న్యాయం , సామాజికంగా భద్రత కలిగిన పంచాయతీ, సుపరిపాలనతో పంచాయతీ, మహిళా అనుకూల పంచాయతీ లపై గ్రామ స్థాయిలో మొత్తం 147 సూచికలు (బైనరీ – 65, న్యూమరిక్ – 82)పై శిక్షణ శిక్షణ ద్వారా అధికారులకు పంచాయతీ అభివృద్ధి సూచిక అమలు విధానాలపై అవగాహన కల్పించారు. జాతీయ స్థాయిలో మన జిల్లా గ్రామాలు ముందంజలో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ నాగలక్ష్మి , జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, విద్య శాఖ అధికారి వెంకటేశ్వరచారి, జిల్లా అధికారులుఅన్ని మండలాల ఎంపి డి ఓ లు, ఎంపీఓలు, ఏపీవోలు , ప్రతి మండలం నుంచి ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కణితి సతీష్ కుటుంబాన్ని పరామర్శించన పొదెం



**భద్రాచలం టౌన్, జూన్ 19(ప్రజాజ్యోతి) :** భద్రాచలంలో దారుణంగా హత్య కాబడిన గిరిజన బిడ్డ కణితి సతీష్ దశ దిన కర్మలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, తెలంగాణ అటవీశాఖ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా సతీష్ కుటుంబ సభ్యుల పట్ల ప్రగాఢ సానుభూతి తెలుపుతూ సతీష్ నివాళులు అర్పించారు. కుటుంబానికి తాను అండగా ఉంటానని హత్యకు పాల్పడిన వారు అందులో పాల్గొనవారు ఎంతటి వారైనా సరే వారికి శిక్ష పడే వరకు వారిని విడిచిపెట్టనని, ఈ కేసు విషయంలో ఎటువంటి జాప్యం లేకుండా ఆధారాలు సేకరించి దోషులందరకు శిక్షపడేలా చేసేవరకు తాను వారి వెంట నిలబడతానని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో దుమ్ముగూడెం మండల అధ్యక్షుడు వినీల్ ,యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు ఎడారి ప్రదీప్,సాంబ, వరుణ్,శ్యామ్ సింహాద్రి, ప్రవీణ్ పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం



**భద్రాచలం కల్చరల్, జూన్ 19(ప్రజాజ్యోతి ):** భద్రాచలం దివ్య క్షేత్రంలోని బేడా మండపంలో అర్చకులు గురువారం స్వామివారికి నిత్యకల్యాణం నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరా ధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యబలిహరణం, నిత్యహోమాలు, నిత్యపూజలు జరి పారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## డిడి మణెమ్మ చేతుల మీదుగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేత



**భద్రాచలం టౌన్, జూన్ 19(ప్రజాజ్యోతి) :**గురువారం స్థానిక కేసీఆర్ కాలనీలో గల ఏ హెచ్ ఎస్ బాలుర పాఠశాల నందు డి డి మణమ్మ చేతుల మీదుగా పాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, దుప్పట్లు, పరుపులు అందజేశారు.ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుల్లో మరింతగా రాణించాలని,ఉన్నత శిఖరాలకు ఎదగాలని, ప్రతి వి ద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఆ లక్ష్యం దిశగా ప్రయాణించి చదు వుల్లో రాణించాలని, విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని వసతులను ఉపయోగించుకోవాలని అన్నారు, ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి నరేంద్ర, వార్డెన్ గుగులోత్ మోహన్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మండల ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**ఆళ్ళపల్లి. జూన్19. ప్రజా జ్యోతి** ఆళ్ళపల్లి మండల అధ్యక్షులు వాసం శ్రీనాథ్ మాట్లాడుతూ, యువనేత రాహుల్ గాంధీ సేవా భావాన్ని స్మరించడంతో పాటు, ఆయన దీర్ఘాయుష్కుడిగా, ఆరోగ్యంగా ఉండాలని ఆ భగవంతుణ్ణి కోరుకుంటూ అనేక విధమైన కార్యక్రమాలు సమాజంలో సహాయ సేవా దృక్పథాన్ని పెంపొందించేందుకు ఆదర్శంగా నిలుస్తాయని తెలియజే సారు. ఈ కార్యక్రమమంలో కొ ప్రచారకమిటి సభ్యులు వాసం శ్రీకాంత్ కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు నర్సమ్మ ,చింత బాలకృష్ణ , బట్టీని శ్రీధర్ ,కొమ్మ శ్రీను , యవజన నాయకులు నిట్ట ఢిల్లీప్ , స్టాలిన్ , బారత్ ,తులం శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రైవేటు "ఫీ"జులుం

- అధిక ఫీజులు వసూళ్లపై..
- యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ యుఐ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ!
- ప్రభుత్వ నిర్ణయం మేరకే ఫీజులు వసూలు చేయాలని డిమాండ్!
- కార్పొరేట్ స్కూళ్లలో నియంత్రణ లేని ఫీజులు?
- పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించాలి
- ఫీజు నియంత్రణ కమిటీని నియమించాలని డిమాండ్!
- ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత
- త్వరలోనే ప్రైవేట్ స్కూల్ యాజమాన్యంతో చర్చలు జరుపుతానన్న ఎమ్మెల్యే

**ఇల్లందు, జూన్ 19, ప్రజాజ్యోతి:** చదువుకునే పరిస్థితి నుండి... చదువుకునే పరిస్థితులు నెలకొన్నాయి. దశాబ్దాల క్రితం ఎక్కడో ఒక దగ్గర కనిపించే ప్రైవేట్ పాఠశాలలు ప్రస్తుతం పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. మాయమాటలతో.. నమ్మశక్యం గాని హామీలతో... తల్లిదండ్రులను బురిడీ కొట్టిస్తూ కొన్ని ప్రైవేటు యాజమాన్యాలు విద్యను వ్యాపారం చేసి.. కోట్లు గడుస్తున్నాయనేది వాస్తవం. ప్రభుత్వ నియమ నిబంధనలను తుంగలో తొక్కుతూ.. విద్యా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాయనే బహిరంగ ఆరోపణలు లేకపోలేదు. ఇక తల్లిదండ్రులు సైతం మార్కులు, ర్యాంకుల మోజులో పడి ఆర్థిక ఇబ్బందులున్నా కానీ తమ పిల్లల భవిష్యత్తు అంటూ.. విద్యార్థుల ఇష్టాన్ని గాలికి వదిలేస్తూ.. బలవంతపు చదువులు... బలం లేని పునాదుల్లా మారుతున్నాయి.. విద్యా పూర్తిగా వ్యాపారంగా మారిపోయింది. చదువుకునే రోజులు పోయి, చదువు కొనుక్కునే రోజులు వచ్చాయి. ప్రాథమిక విద్య నుండి ఉన్నత విద్య వరకు పేదవాడి శ్రమ దోపిడిగా మారిందనే చెప్పొచ్చు. పోటీ ప్రపంచంలో పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు పడుతున్న తపన ప్రైవేటు విద్యాసంస్థలకు లాభ మార్గంగా మారింది.

### యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ యుఐ నిరసన ర్యాలీ

ప్రైవేటు విద్యాసంస్థల్లో అధిక ఫీజుల వసూళ్లపై ఇల్లందు యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ యుఐ సంయుక్త ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్పొరేట్ విద్యాసంస్థలు రోజురోజుకు అధిక ఫీజులు వసూలు చేస్తూ పేద, మధ్యతరగతి ప్రజల విద్యను భారం చేస్తున్నాయని, రాజ్యాంగంలో హామీగా ఇచ్చిన సమాన విద్య హక్కును నేరుగా ప్రభావితం చేస్తుందని యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ యుఐ పేర్కొన్నారు. కార్పొరేట్ స్కూల్స్ లలో ప్రభుత్వం నిర్ణయించిన పరిమితికి లోబడి ఫీజులు వసూలు చేయించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం పేద విద్యార్థులకు ఉచిత విద్య, స్కాలర్ షిప్ అందేలా చూడాలని, నిర్దిష్టమైన ఫీజు నియంత్రణ కమిటీని నియమించాలని కోరారు.

### పేద విద్యార్థులకు ఉచిత విద్య అందేనా

ప్రభుత్వం నిబంధన ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించాల్సి ఉంది. ఇల్లందులో మాత్రం అధిక పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తున్నప్పటికీ, కొన్ని పాఠశాలల్లో మాత్రం ఉచిత విద్య అందించకపోగా, ఇప్పటి ముప్పడిగా తల్లిదండ్రుల ముక్కు పిండి మరి ఫీజులు వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా ప్రతి ఏటా ఫీజులు పెంచుతూ విద్యార్థుల తల్లిదండ్రుల జేబులకు చిల్లులు వేస్తున్నట్లు సమాచారం.

### అర్హత లేని వారితో విద్యాబోధన

ప్రభుత్వ పాఠశాలల్లో బిఈడి, టిటిసి పూర్తి చేసిన వారినే ప్రభుత్వం ఉపాధ్యాయులుగా నియమిస్తుంది. కానీ ప్రభుత్వ నిబంధన ప్రకారం కానీ అర్హత లేని వారిని ప్రైవేట్ పాఠశాలల్లో టీచర్లుగా నియమించవద్దు. ప్రైవేటు పాఠశాలల్లో కొంతమేర అర్హత (బిఈడి, టిటిసి) ఉన్నవారిని నియమించి విద్యాబోధన చేయడం జరుగుతుంది. కొన్ని పాఠశాలల్లో మాత్రం ఆయా యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ ఇంటర్, డిగ్రీ చదివిన వారితో విద్యాబోధన చేయించడం జరుగుతుందని సమాచారం. ఇలా నిబంధనలు పాటించని యాజమాన్యాలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### ప్రైవేటు యాజమాన్యాలతో మాట్లాడుతాను: ఎమ్మెల్యే కోరం



ఇల్లందు ప్రైవేట్ విద్యాసంస్థలు ఫీజులో నియంత్రణ లేకపోవడం వల్ల యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ యుఐ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ప్రైవేటు యాజమాన్యాలతో మాట్లాడి ఫీజుల నియంత్రణ, పాఠశాలల ప్రాంగణాలలో తప్పనిసరిగా క్రీడల కోసం స్థలం ఉండేలా చూస్తాను. ఏజెన్సీ ప్రాంతమైన ఇల్లందులో పేద విద్యార్థులు అధికంగా ఉన్నారని, ప్రైవేటు విద్యాసంస్థల్లో నేటి పోటీ ప్రపంచంలో తల్లిదండ్రులు వారి పిల్లలను చేర్పిస్తున్నారు. గతంలో కమ్యూనిస్టు పార్టీలు పాఠశాలల్లో అధిక ఫీజులు తగ్గించాలని ఆందోళనలు చేసేవారని, ప్రస్తుతం యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ యుఐ సంయుక్త ఆధ్వర్యంలో ఆందోళనలు, పోరాటాలు చేయడం జరుగుతుంది. అదేవిధంగా నూతన భవనాలు కట్టి, వాటిని ఫీజుల రూపంలో వసూలు చేయడం, యాజమాన్యాలు ఫీజుల ద్వారానే భవనాలు కట్టారని, వారు సొంతగా కట్టించలేదు. ముఖ్యంగా ప్రవేటు పాఠశాలలో ఫీజులు తగ్గేలా చూస్తాను. ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీష్ మీడియాలలో విద్య అందించడం జరుగుతుంది. ప్రైవేటు పాఠశాలల్లో కాకుండా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు విద్యనభ్యసిస్తే నాణ్యమైన విద్య అందుతుంది. ప్రైవేటు యాజమాన్యాలు ఆయా పాఠశాలల్లో బిఈడి, టిటిసి అర్హత గల టీచర్లను నియమించాలి. కొన్ని యాజమాన్యాలు ఇంటర్, డిగ్రీ చదివిన వారితో విద్య బోధన చేస్తున్నారు. ఇలానే అర్హత ఉన్న టీచర్లను నియమించి విద్య అందించని పాఠశాలలను బంద్ చేసేలా చూస్తాం. ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా బిఈడి, టిటిసి పూర్తి చేసిన టీచర్లు ఉండాలి.

### ఫీజులను నియంత్రించాలి:

ఈసం లక్ష్మణ్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు, యూత్ కాంగ్రెస్, ఇల్లందు ఇల్లందులోని ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చేయాలి. పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించాలి. ప్రభుత్వ నిబంధన మేరకు అర్హత కలిగిన టీచర్లచే విద్యాబోధన చేయాలి. అదేవిధంగా ఫీజుల నియంత్రణ కమిటీని నియమించాలి. విద్య పేరుతో వ్యాపారం చేస్తే ఊరుకొం. ఎమ్మెల్యే స్పందించి ఫీజుల దోపిడిని అరికట్టాలి. విద్యార్థులకు అర్హత గల టీచర్లు ఇచ్చే విద్యను అందించారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు




**భద్రాచలం టౌన్, జూన్ 19(ప్రజాజ్యోతి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొదెం వీరయ్య క్యాంప్ కార్యాలయంలో భవిభారత ప్రధాని రాహుల్ గాంధీ జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తెలంగాణ రాష్ట్రా అటవీ శాఖ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, డి.సి. సి అధ్యక్షులు పొదెం వీరయ్య పాల్గొని కేక్ కట్టింగ్ చేసి మిఠాయి పంచారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ బాటలో నడుస్తూ కాంగ్రెస్ పార్టీని విజయవంతంగా నడిపిస్తూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతున్న భావి భారత ప్రధాని రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలొ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అడబాల. వెంకటేశ్వర రావు, బంధం. శ్రీనివాస్ గౌడ్, గానుగ. రమణ, సేవాదళ్ మండల అధ్యక్షులు శీలం. రామ్మోహన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు యాదరి. ప్రదిప్ చింతిరాల. సుధీర్, కాపుల. ఏసు, వాసిరెడ్డి. సాంబశివారవు, కే. వరుణ్చింతిరాల. అరుణ్ రాజ్, శ్యామ్ఆర్. టీ. సి ఐ. ఎన్. టీ. సి నాయకులుమాధవరావు, కొండా. సతీష్, మహిళా కాంగ్రెస్ నాయకులు సరిత, పద్మా ప్రియా, జయమ్మ, మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ధర్తీ అభ జన్ భగీదరి అభియాన్ గ్రామ సభ



**పాల్వంచ(రూరల్ ), జూన్ 19, ప్రజా జ్యోతి :** గిరిజన సంక్షేమం కొరకు ఏర్పాటు చేసిన ధర్తీ అభ జన్ భగీదరి అభియాన్ గ్రామ సభలను సద్వినియోగం ఉపయోగించుకోవాలని ఎంపీడీవో విజయభాస్కర రెడ్డి సూచించారు. రంగాపురం గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో మాట్లాడుతూ ఆధార్ కార్డు, ఆయుష్మాన్ భారత్, జన్ ధన్ అకౌంట్, కుల ధ్రువీకరణ పత్రం, ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు, కిసాన్ సమృద్ధి యోజన కార్డుల కొరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ లక్ష్మీ ప్రసన్న, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనిజ, ఏపీవో రంగా, ఏపీఎం రాంబాబు, కార్యదర్శులు జి మౌనిక, దుర్గ , ఏఈఓ సత్యం, ఏఎన్ఎం ఇందిరా, అశోక్ కుమార్, పార్వతి, రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

- మండల అధ్యక్షులు వనమా గాంధీ



**అన్నపురెడ్డిపల్లి, జూన్ 19, ప్రజాజ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో జాతీయ కాంగ్రెస్ పార్టీ యువనేత, రథసారథి రాహుల్ గాంధీ జన్మదిన సందర్భంగా మండల అధ్యక్షులు వనమా గాంధీ ఆధ్వర్యంలో అన్నపురెడ్డిపల్లి, మెయిన్ సెంటర్ నందు కేక్ కటింగ్ చేసి, వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో వనమా గాంధీ మాట్లాడుతూ అన్ని అడ్డంకులకు వ్యతిరేకంగా పోరాడడమే ఆయన వ్యక్తిత్వం, అణగారిన వర్గాలకు అండగా నిలబడటం ఆయన దృక్పథం, త్యాగం, వారసత్వం, పోరాటం. ఆయన వివేకవంతుడు మరియు భారతదేశ రేపటి ఆకాంక్షలను నెరవేర్చే ఏకైక నాయకుడు అని కొనియాడారు .ఈ కార్యక్రమంలో వనమా శ్రీను, ఈనుగంటి ప్రసాద్, దోసపాటి రాంబాబు,, కొత్త గుండ్ల సీతయ్య, కల్లోజు నరసింహ, పెంకె వెంకటేశ్వర్లు, చల్ల పుల్లయ్య, షేక్ గఫార్, ఎస్.కె బహదూర్, దోసపాటి శంకర్రావు, వేముల సత్యనారాయణ, పూదూరు సైదులు, కంచర్ల రాఘవ, పెద్దారపు సైదులు, మారగాని రవి, కారం భద్రయ్య, S. సీతయ్య, ఇళ్ల శీను, కొత్తగుండ్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సహాయ ఉపకారణముల కోసం ఓబి ఎంఎంఎస్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ



**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 19, ప్రజా జ్యోతి:** జిల్లాలోని దివ్యాంగులకు సహాయ ఉపకారణంల కోసం అర్హులైన వారి నుండి ఆన్లైన్ ద్వారా దరఖా స్తులు చేసుకోవడానికి ఈ నెల 27 వరకు పొడిగించినట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి జేఎం స్వర్ణలత లెనినా గురువారం తెలిపారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రిట్రో ఫిట్టెడ్ మోటార్ వాహనాలు , బ్యాటరీ వీల్ చైర్లు మొబైల్ బిజినెస్ బ్యాటరీ వీల్ చైర్లు బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో హైబ్రిడ్ వీల్ చైర్ లాప్టాప్స్ టాప్స్ , 5G స్మార్ట్ ఫోన్, ట్రై సైకిల్ వీల్ చైర్లు ,వినికిడి యంత్రాలు కోసం ఆన్లైన్ ద్వారా https://tgobmms.cgg.gov.in దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు, అర్హతను అనుసరించి సహాయ ఉపకరణముల కొరకు ఈనెల 27లోగా ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, చేసుకున్న దరఖాస్తులను జిల్లా సంక్షేమ శాఖ అధికారి మహిళా శిశు దివ్యాంగుల ,వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయం ఐ డి ఓ సి జి 1 నందు దరఖాస్తులు అందించాలని, పూర్తి వివరాల కోసం 63019 81960 83310 06010. నెంబర్లకు సంప్రదించాలని కోరారు.